

"2021 - 2024 నడుమ గోశాలలో అనేక అక్రమాలు జరిగాయి. అప్పట్లో చనిపోయిన ఆవులను లెక్కల్లో చూపకుండా ఖననం చేసేశారు. గోవుల మరణాలు దాచిపెట్టేశారు. అవన్నీ ఇప్పుడు విజిలెన్స్ విచారణలో బయటపడుతున్నాయి. పారిశుద్ధ్య లోపం, ఎక్కడ చూసినా తడి, నీటి నిల్వ, దుర్వాసనలతో గోశాల నిర్వహణ దారుణంగా వుండేది. పురుగులు పట్టిన దాణా పెట్టేవారు. కాలం చెల్లిన మందులు వాడారు. దాణా కొనుగోళ్లలో అవకవతకలు జరిగాయి. అవన్నీ దాచిపెట్టి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ,హిందువుల మనోభావాలను, టీటీడీ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడం మంచిది కాదు."

- టీటీడీ ఈవో శ్యామలరావు



"హిందూ ధర్మంపై మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కనీసం నాలుగు పద్యాలు పలుక గలరా? ఏడుకొండల పేర్లు చెప్పగలరా? బీజేపీని ఎదగనివ్వకుండా చేసి, ఎయిర్‌పోర్టుకీ, దర్శనాలకీ, హోటళ్లకే పరిమితమైన వ్యక్తి కూడా నా మాటలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని మాట్లాడడం విడ్డూరం. నేను చూపించిన ఫొటోలు గోశాలలో తీసినవే. నా మాటలకు కట్టుబడి ఉన్నా. టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులల్లో 2వేలమంది మా నిఘా నేత్రాలే. వారందరూ ఎప్పటికపుడు మాకు టీటీడీలో జరుగుతున్న విషయాలపై సమాచారం ఇస్తుంటారు. మీ కేసులకు భయపడను."

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్



■ ముంచెత్తిన అభిమానం

తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి తదితరులు

● వాడవాడలా అంబేడ్కర్‌కు ఘన నివాళి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. ఉదయం నుంచే అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వివిధ సంఘాల నేతలు పూలమాలలు వేశారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.



చేపల వేటకు విరామం

- నేటి నుంచి 61 రోజులపాటు -

ఎగసిపడే అలలను చీల్చుకుంటూ.. పగలు, రాత్రి లేకుండా.. నడిసంద్రంలో జీవన పోరాటం చేసే మత్స్యకారులకు కొంతకాలం విశ్రాంతి లభించనుంది. మత్స్య సంపద వృద్ధి చెందేందుకు ప్రభుత్వం మంగళవారం నుంచి 61 రోజులపాటు చేపల వేటకు విరామం ప్రకటించింది. నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

కోట మండలం గోవిందపల్లిపాళెం వద్ద ఒడ్డుకు చేరిన పడవలు

● మత్స్య సంపద వృద్ధికి ఈ రెండు నెలలే కీలకం
● పులికాట్‌కూ వర్తింపు

జిల్లాలో చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 75 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరం విస్తరించి ఉంది. తీర గ్రామాల్లోని మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. వీరు 25 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నుంచి వేటకు వెళుతుంటారు. సముద్ర జలాల్లో మత్స్య సంపద పెంపు, మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరచడమే ధ్యేయంగా వేట నిషేధాన్ని 61 రోజుల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. రొయ్యలు, చేపలు ఏప్రిల్ నుంచి జూన్ నెల మధ్య తమ సంతానోత్పత్తికి గుడ్లు పెట్టే కాలంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ కాలంలో వేటను సాగిస్తే గుడ్లు వలలకు చిక్కుకుని సంపద తగ్గే ప్రమాదం ఉంది. ఈ రెండు నెలల పాటు వేటను నిషేధిస్తే, ఆ తర్వాత ఏడాది పాటు మత్స్యకారులకు సంపద ఎక్కువగా లభిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. పులికాట్ సరస్సుకు కూడా ఈ నిబంధన వర్తింపచేసినట్లు వారు తెలిపారు.

నిషేధ కాలంలో భృతి

చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం జీవన భృతి అందజేస్తోంది. ఈ భృతి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం గతేడాది రూ.10వేలు ఇస్తామని ప్రకటించింది. అప్పటి జగన్ ప్రభుత్వం వడపోత వల్ల చాలా మంది మత్స్యకారులు భృతికి దూరమయ్యారు. ఈ ఏడాది చేపల వేట నిషేధ కాలంలో భృతిని రూ.20వేలకు పెంచుతూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరుకు వారికి అందజేయనుంది.

నిధులు మంజూరైన వెంటనే వారి ఖాతాల్లో జమ

వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ప్రభుత్వం రూ.20 వేల భృతి అందిస్తుంది. ఈ నిధులు మంజూరైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తాం. మత్స్యకారులను ఈ రెండు నెలల పాటు ఆదుకుంటాం.

- కలెక్టర్ వెంకటేశ్వర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఈ 61 రోజుల్లో ఎవరైనా వేట సాగిస్తే జరిమానాతో పాటు బోటు రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తాం. మరబోట్లు ఉన్నవారంతా ఈ నిషేధాన్ని పాటించాల్సిందే.

- రాజేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లా వివరాలు

సముద్ర తీరం పొడవు : 75 కిలోమీటర్లు
తీర ప్రాంత మండలాలు : ఐదు
మత్స్యకార గ్రామాలు : 42
మత్స్యకారులు : 20వేల మంది
వేట సాగించేవారు : 3,876 మంది
సముద్ర తీరంలో వేట సాగించే బోట్లు : 878

ఇళ్లకు చేరిన మత్స్యకారులు

కోట, ఆంధ్రజ్యోతి: చేపల వేట నిషేధం నేపథ్యంలో సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులంతా ఇప్పటికే ఇళ్లకు చేరుకున్నారు. తమ పడవలను సముద్ర తీరంలో భద్రపరుచుకున్నారు. ఈ 61 రోజుల పాటు పడవలన్నీ తీరానికే పరిమితం కానున్నాయి.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మినీ లారీ బోల్తా

● వాహనం తీసుకుని పరారైన అక్రమార్కులు
● వంద బస్తాలు ఎత్తుకెళ్లిన స్థానికులు

పెళ్లకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం 71వ జాతీయ రహదారిపై దిగువ చావాలి వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మినీ లారీ సోమవారం బోల్తా పడింది. వెంటనే రేషన్ మాఫియా ముఠా మినీ లారీని పైకి లేపి అక్కడ నుంచి వాహనం తీసుకుని పరారయ్యారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు వంద బస్తాల బియ్యాన్ని ఎత్తుకెళ్లిపోయారు. మిగిలిన బియ్యాన్ని దిగువ చావాలి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో తరలించిన్నట్లు తెలిసింది. ఆ బియాన్ని తన ఇంటివద్ద దించడంతో టీడీపీ నాయకుడు నేలవల్లి సిద్దులయ్యనాయుడు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగరాజు గ్రామానికి చేరుకుని విచారించారు. 2300 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణకు అప్పగించారు. వారు ఆ బియ్యాన్ని స్థానిక చౌక దుకాణదారుడికి అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దిగువ చావాలిలోని ఓ ఇంటి వద్ద ఉంచిన రేషన్ బియ్యం

ఇంటర్‌లో బాలికలదే హవా

తిరుపతి(విద్య), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఫలితాల్లో అధికంగా బాలికలు ఉత్తీర్ణత సాధించి హవా చాటారు.

● ఫస్టియర్ జనరల్ విభాగంలో 15,649 మంది బాలురు పరీక్ష రాయగా, 10,322 మంది పాసై 66 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. బాలికలు 14,701 మంది పరీక్షలు రాయగా 11,311 పాసై 77 శాతం ఉత్తీర్ణత సాధించారు.


● సెకండియర్‌లో 13,880 మంది బాలురకు 11,628 మంది పాసై 84 శాతం.. 13,561 మంది బాలికల్లో 12,023 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

● ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో 555 మంది బాలురకు 297 మంది పాసై 54 శాతం.. 571 మంది బాలికల్లో 473 మంది పాసై 83 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● సెకండియర్‌లో 496 మంది బాలురకు గాను 370 మంది పాస్ అయి 75 శాతం.. 434 మంది బాలికల్లో 409 మంది పాసై 94 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

22 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారిలో 22 మందికి సోమవారం బాండ్లు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టీడీఆర్ మేళాలో అర్హత పొందిన వీరికి కమిషనర్ మౌర్య బాండ్లు అందించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి సంబంధించి 95 శాతం ఆన్‌లైన్ చేశామని ఆమె తెలిపారు. కోర్టు కేసులు, ప్రభుత్వ, టీటీడీ భూములు, 22ఏ కింద ఉన్నవి మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఐదు బాండ్లు ఇచ్చామని, సోమవారం 22 బాండ్లు ఇచ్చామన్నారు. ఖాళీ జాగాలకు స్థానిక విలువ ప్రకారం గుర్తించామన్నారు. టీడీఆర్ బాండ్ల కమిటీ సమావేశమై 96 మందికి ప్రీ అప్రూవల్ తీసుకుని అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇస్తే తరువాత బాండ్లు అందజేస్తామని అన్నారు. వీరు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ విజయభాస్కర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ మహా పాత్ర, ఏసీపి లు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు టీడీఆర్ బాండ్లు అందజేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుమలలో డ్రైవర్ల మధ్య ఘర్షణ

● చికిత్స పొందుతూ ఒకరి మృతి

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో డ్రైవర్ల దాడిలో గాయపడిన ఓ జీపు డ్రైవర్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా కురబలకోటకు చెందిన వెంకటశివ తిరుమలలో ట్యాక్సీ డ్రైవర్‌గా ఉంటున్నాడు. ఈనెల 12న పోలీస్‌కాంప్లెక్స్‌కు సమీపంలోని రాంబగీచా బస్టాండు సమీపాన ఇతడు తన వాహనాన్ని నిలిపాడు. పార్కింగ్ విషయంలో తిరుపతికి చెందిన మరో ముగ్గురు డ్రైవర్లు వెంకటశివతో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి వెంకట శివపై రాయితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటశివను పోలీసులు తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మద్యం మత్తులోనే డ్రైవర్లు దాడి చేసినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. డ్రైవర్ మృతి సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

చంద్రగిరి

ముగిసిన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు


చక్రస్నానం చేయిస్తున్న ఆలయ అర్చకులు

చంద్రగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. 8 నుంచి 9 గంటల వరకు వసంతోత్సవం జరిగింది. అనంతరం చక్రతాళ్వార్లకు స్నపన తిరుమంజనం చేశారు. అలాగే వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా ఆలయ ప్రాంగణంలో గంగాళంలో చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించారు. దీంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. మంగళవారం ఉదయం పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, కంకణ బట్టర్ శ్రీనివాస బట్టర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన ప్రారంభం



చంద్రగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన రెండవ రోజు సోమవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేక మండపంలో కొలువుదీర్చి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఊంజల్ సేవ జరిగింది. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు ససుపు, కుంకుమ, పసుపుదారం, గాజులు, జాకెట్టు, లక్ష్మీదేవి చిత్రపటం, ప్రసాదం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిలో ఫ్లెక్సీలతో ఇబ్బందులు


విద్యుత్ వైర్లపై పడిన ఫ్లెక్సీ భాగం

చంద్రగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రహదారిలో ప్రచారం కోసం కొందరు రాజకీయ పార్టీల నాయకులు, ఇతరులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు ఎక్కువ మంది జన్మదిన వేడుకలు లేదా ఇతర కార్యక్రమాలకు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం సాధారణమైపోయింది. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో ఫ్లెక్సీలు చిరిగిపోయి ఎగిరి విద్యుత్ తీగలపై పడ్డాయి. సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఓ ఫ్లెక్సీని తొలగించడానికి విద్యుత్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గాయపడిన పంచాయతీ కార్మికుడికి ఆర్థిక సాయం

చంద్రగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన తొండవాడ పంచాయతీ కార్మికుడు బుంగా విజయ్‌కుమార్‌కు సర్పంచ్‌తో పాటు పంచాయతీ,సచివాలయ సిబ్బంది సోమవారం ఆర్థిక సాయం అందించారు. విజయ్‌కుమార్ విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగింది. అతడి చేయి విరిగింది. సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, కార్యదర్శి భానుప్రియ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది కలిసి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన


కరపత్రాలతో అగ్నిమాపక సిబ్బంది, హరీంద్రనాథ్

తిరుమల, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై భక్తులకు అవగాహన కల్పించారు. వారోత్సవాలను సోమవారం టీటీడీ రిసెప్షన్ అధికారి హరీంద్రనాథ్ ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రాధికారి సుబ్రహ్మణ్యం రెడ్డి, సిబ్బంది ప్రమాదాల నివారణపై కరపత్రాలను భక్తులకు అందజేశారు.

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ విజయ్ భాస్కర్‌రెడ్డి - ద్వారక తిరుమలరావు

తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీ విజయ్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే ఏపీ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఏపీ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ భైరా రామకోటేశ్వరరావులు కూడా శ్రీవారి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణ వేడుకలో ఎమ్మెల్యే పులివర్తి నాని,కుటుంబ సభ్యులు

పాకాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పులివర్తివారిపల్లెలో సోమవారం రాత్రి వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపులో గ్రామస్థులతో కలిసి పాల్గొన్నారు. కనులపండువగా జరిగిన స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి పరిసర గ్రామస్థులు కూడా తరలివచ్చారు. **రామచంద్రాపురం:** కమ్మకండ్రిగ,గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో కోదండరాముని పట్టాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పట్టాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు.

రైలు నుంచి జారిపడిన ప్రయాణికుడి మృతి

పిచ్చాటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రైలు దిగుతూ జారిపడిన ఓ ప్రయాణికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని రజానగరం గ్రామానికి చెందిన పరుచూరి మురళి(51) తన సొంత పనుల నిమిత్తం శనివారం చెన్నైకి వెళ్లాడు. అక్కడ విల్లివాక్కం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చెన్నైలోని ఓ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం 11 గంటలకు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బడుగువర్గాల ప్రగతికి అంబేడ్కర్ బాటలు : నాని

పాకాల, ఏప్రిల్ 14 (ఆంధ్రప్రదేశ్): మండలంలో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాలు, ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ ఎదుట అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్తూరు రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ భవనంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, సర్పంచ్ ఎస్.కస్తూరి, నాయకులు కె.సుధాకరయ్య, డేవిడ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. తమ కార్యాలయంలో తహసీల్దార్ సంతోష్ సాయి నివాళులు అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పి.జయకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎ.శ్రీధర్‌బాబు, నాయకులు బ్రహ్మ, రాధాకృష్ణలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **రామచంద్రాపురం:** అంబేడ్కర్ సేవలు దేశానికి చిరస్మరణీయమని నాలుగవ జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి జరిగింది. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన్‌చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, మునిరామిరెడ్డి, గిరిరెడ్డి నివాళులు అర్పించారు. వైసీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్, ఎస్సీ నాయకుడు బాలయ్య, శేఖర్, మనోహర్, బీజేపీ అధ్యక్షుడు జనార్దన్‌నాయుడు, కృష్ణమూర్తి నివాళులు అర్పించారు.

ఎర్రావారిపాలెం: ఎల్లమంద క్రాస్ కూడలి వద్ద అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్‌చేశారు. ముఖ్యఅతిథిగా తలకోన ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ సోమనాథరెడ్డి,రమాదేవి, డాక్టరు రమణ, విజయ్, సీపీఐ మండల కార్యదర్శి రమణ నాగరాజ,బీసీ సంఘం నాయకులు కృష్ణయ్య,చిన్నప రెడ్డి,నరేంద్ర,అశోక్, అంజి పాల్గొన్నారు.

భాకరాపేట: మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో సత్యనారాయణ, ఏవో సతీశ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, సహదేవయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: తుమ్మలగుంట పంచాయతీ ఉప్పరపల్లె కమిటీ హాల్‌వద్ద టీడీపీ ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. హక్కుల కోసం పోరాడేందుకు ఓటు హక్కును ఆయుధంగా అందించిన మహనీయుడిగా అంబేడ్కరును అభివర్ణించారు. అవిలాల అంబేడ్కర్ కాలనీలో సర్పంచ్ వెంకటరమణ, సి.మల్లవరంలో సర్పంచ్ మొక్కల భారతి నివాళులర్పించారు.


ఆర్‌సీపురంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


పాకాలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని


నివాళి అర్పిస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి తదితరులు.

చంద్రగిరి: పట్టణంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పోట్లూరి రామారావు, శంకర్‌మాదిగల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టవర్ క్లాక్ వద్ద విగ్రహానికి దళితులు, టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ రూపారామ్మూర్తిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నం, నాయకులు రాజుగోపాల్, కుమారరాజారెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, లోకాద్రి, మాజీ జడ్పీటీసీ అమ్ములు, బాలసుబ్రమణ్యం, మండీరావు, సురేష్, శ్రీపతి, హరి, పాల్గొన్నారు.

తిరుమల హెచ్‌వీసీలో స్వల్ప అగ్నిప్రమాదం


మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఓ గార్డెన్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. హెచ్‌వీసీ ప్రాంతంలోని కదంబ వనంలో మంటలు రావడంతో సమీపంలోని సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. కారణాలపై విచారిస్తున్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం పది నిమిషాల పాటు జల్లులు కురిశాయి. అనంతరం వర్షం నిలిచిపోగా వాతావరణం చల్లబడింది. భక్తులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. అయితే ఒక్కసారిగా వర్షం కురవడంతో భక్తులు షెడ్లకిందకు పరుగులు తీశారు.

వివాహిత అనుమానాస్పద మృతి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని న్యూ బాలాజీ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ షౌకత్ అలీ, ముంతాజ్ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. మూడో కుమార్తె యాస్మిన్ ఎంబీఏ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలో యాస్మిన్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి తొమ్మిదో తేదీన వివాహం చేయడానికి ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లికి మూడ్రోజుల ముందు తనతోపాటు చదువుకున్న పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన సాయితేజను ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ వివాహం ఇష్టంలేని తల్లిదండ్రులు పోటుకనుమకు వెళ్లి తమతో ఇంటికి వచ్చేయాలని యాస్మిన్‌ను కోరారు. అప్పట్లో ఆమె రాలేదు. ఆదివారం చిత్తూరులోని తల్లిదండ్రుల ఇంటికి రాగా పెళ్లిపై యాస్మిన్‌ను మందలించారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కమ్మీకి చున్నీతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త సాయితేజ మాత్రం తన భార్యను అత్తమామలే చంపేశారని ఆరోపించాడు. యాస్మిన్ తల్లి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సోమవారం సీఐ తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శనివారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శనివారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. ఆదివారం శ్రీవారిని 79,100మంది దర్శించుకున్నారు.

బకాయిల విడుదల సంతోషకరం



మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసులురాజు,తదితరులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించి ఐదేళ్లుగా పెండింగ్ ఉన్న రూ.26వేల కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.10,500కోట్లు విడుదల చేయడం సంతోషమకరమని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. మిగిలిన బకాయిలనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ల వద్ద పాఠశాలలు మూతపడవన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పీఆర్సీ ఏర్పాటు చేసి, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్ బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసి ఉపాధ్యాయులతో బోధించడం వల్ల నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉపాధ్యాయ బదిలీ చట్టం ద్వారా అర్హత కలిగిన టీచర్లకు పదోన్నతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హైమారావు, తరిగొండ సురేష్‌కుమార్, జయప్రకాష్‌నాయుడు, శ్రీనివాసరావు, బావాజాన్, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు కలెక్టర్ ఘన నివాళులు



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కలిసి రండి

● తిరుపతి ర్యాలీలో సీపీఐ నేత నారాయణ పిలుపు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తాం. దీనికి లౌకిక శక్తులు కలిసి రావాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ పేరిట సోమవారం తిరుపతిలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల టీటీడీపై దుష్ప్రచారం చేసే కుట్రలు జరుగుతున్న క్రమంలో భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. టీటీడీని రాజకీయ లబ్ధి కోసం వాడుకోరాదని నాయకులకు హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, రాధాకృష్ణ, విశ్వనాథ్, ఎన్‌డీ రవి, కేవై రాజా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు

ఓర్వలేక నానీపై విమర్శలు

చంద్రగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానిని విమర్శిస్తే పుట్టగతులుండవని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శలను ఆయన ఖండించారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ప్రజాదరణ చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

రేణిగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఓ మహిల మృతిచెందింది. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట పాంచాలి నగర్‌కు చెందిన గోపి, సుజన (49) దంపతులు. వీరు కరకంబాడి పంచాయతీ పరిధిలోని దొడ్లమెట్లకు సొంతపనిపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి రేణిగుంటకు బయలుదేరారు. కొత్త చెక్‌పోస్టు కూడలిలో రోడ్డు పనులు జరుగుతుండడంతో ఒక వైపు రోడ్డు మూసివేశారు. దీంతో అక్కడ రోడ్డు కాస్త ఇరుకుగా ఉంది. ఈ క్రమంలో అక్కడ మలుపులో ఎదురుగా వస్తున్న లారీ వెనుకభాగం వీరి వాహనానికి తగలడంతో దంపతులు కిందపడ్డారు. సుజనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది.

బీర్ బాటిల్‌తో దాడి

రేణిగుంట, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణాపురం పంచాయతీలో ఓ వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి కృష్ణాపురం రైల్వే గేటు వద్ద చోటు చేసుకుంది. అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ గౌరీనాయుడు కథనం మేరకు.. కృష్ణాపురంలో కాపురం ఉంటున్న మురళి ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రైల్వే గేటు వద్ద అదే గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి మురళితో వాదనకు దిగాడు. బీరు బాటిల్‌తో దాడిచేయడంతో మురళికి గాయాలయ్యాయి. దీంతో అతడు ఆస్పత్రి పాలయ్యాడు. సోమవారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యవేడు-బెంగళూరు బస్సు సర్వీసు ప్రారంభం



సత్యవేడు, ఏప్రిల్ 14: సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన నూతన బస్సు ను ఎమ్మెల్యే ఆదిమూలం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సోమ వారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సత్యవేడు - బెంగళూరు సర్వీసుకు సంబంధించిన ఎక్స్‌ప్రెస్ బస్సును ఆర్టీసీ డీఎం వెంకటరమణతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం టికెట్ కొనుగోలు చేసి కొంతదూరం బస్సులో ప్రయాణించారు




ఎగువ కన్నికాపురం దేవాలయంపై కూలిన విద్యుత్ స్తంభం-మృతి చెందిన ఆవులు-వెదురుకుప్పం మండలం ఎగువ కన్నికాపురం పాఠశాల వద్ద విరిగిపడ్డ చెట్టు కొమ్మ

గాలివాన బీభత్సం

వెదురుకుప్పం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. గంటావారిపల్లె గ్రామ పంచాయతీ ఎగువ కన్నికాపురంలో కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి చెట్ల నుంచి పిందెలు కూడా నేలరాలాయి. కార్వేటినగరం మండలంలోనూ గాలివానతో మామిడి కాయలు నేలరాలాయని రైతులు తెలిపారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

గంగవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి.గంగవరం జేఆర్ కొత్తపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు ఓబులప్ప వ్యవసాయంతోపాటు ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే సోమవారం సాయంత్రం ఇంటిముందు కానుగ చెట్టు కింద రెండు ఆవును కట్టి ఉంచారు. ఇంతలో భారీ ఈదురుగాలులతోపాటు వర్షం కురుస్తుండగా కానుగ చెట్టు వద్ద పిడుగుపడి భారీ శబ్దం వచ్చింది. కొంత సేపటికి గ్రామస్థులు చెట్టు వద్దకు వచ్చి చూసేసరికి రెండు ఆవులూ మృతి చెందాయి. ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

11 మండలాల్లో వాన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా 11 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. మండలాల వారీగా.. పూతలపట్టులో 24, యాదమరిలో 22, పెద్దపంజాణిలో 14.6, చిత్తూరులో 7.4, తవణంపల్లెలో 4.8, సోమలలో 4.2, చౌడేపల్లెలో 4.2, పులిచెర్లలో 4, గుడిపాలలో 2.6, బంగారుపాళ్యంలో 2.2, ఐరాలలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఏప్రిల్ నెల సాధారణ వర్షపాతం 7 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, సోమవారం నాటికి 19.9 మి.మీ వర్షం కురిసింది. 16 మండలాల్లో 20శాతానికి మించి, మిగిలిన 15 మండలాల్లో సాధారణానికి మించి 20 శాతంలోపు వర్షపాతం నమోదయ్యింది.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఆ స్ఫూర్తితో బడుగు బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి, గురుకుల పాఠశాలల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టకుండా సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధి హామీ ద్వారా శ్మశాన వాటికల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, నగర కమిషనర్ మౌర్య, మాజీ మంత్రి పరసారత్నం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ స్రవంతి తదితరులు పాల్గొని అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. పలువురు రక్తదానం చేశారు.

కార్పొరేషన్, తుడా కార్యాలయాల్లో..

తిరుపతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జయంతి వేడుకలు తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరపాలక, తుడా అధికారులు పాల్గొన్నారు.

మేధో సంపన్నుడు మోక్షగుండం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అపార మేధో సంపన్నుడని పలువురు పేర్కొన్నారు. మోక్షగుండం వర్ధంతి సందర్భంగా ఎస్వీయూ మార్గంలోని మోక్షగుండం విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళి అర్పించారు. సీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ లేని కాలంలోనే అద్భుతాలు చేసిన నిపుణుడు మోక్షగుండం అని కొనియాడారు.

రాయలవారి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రాయలవారి జయంతిని అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని కోరింది.

పాఠశాలల రద్దు అన్యాయం : సీపీఎం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు రద్దు చేయడం అన్యాయమని సీపీఎం నాయకులు అన్నారు. ప్రజలకు విద్య అవసరమని, ఉచితంగా అందించాలని అన్నారు. ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కందారపు మురళి, జయచంద్ర, బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, సాయిలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు కె.ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

అమరలో రోబోటిక్ డే ఆఫర్లకు విశేష స్పందన



మోకాలి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కరకంబాడి వద్ద ఉన్న అమర హాస్పిటల్‌లో నిర్వహించిన రోబోటిక్ డే ఆఫర్లకు విశేష స్పందన లభించింది. సోమవారం అమర హాస్పిటల్ నిర్వహించిన మోకాలి మార్పిడి స్క్రీనింగ్ క్యాంపునకు విచ్చేసిన 80 మందికి ఉచితంగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ రాయలసీమలోని ప్రజలు చెన్నై, బెంగళూరుకు వెళ్లి మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించుకుంటున్నారని అక్కడ కన్నా మెరుగైన వైద్యం అతి తక్కువ ధరకే అమర హాస్పిటల్‌లో అందిస్తున్నామని తెలియజేశారు. కేవలం రూ.2.50లక్షలతో మోకాలి మార్పిడి ప్యాకేజీని ప్రవేశ పెట్టామన్నారు. ఈ ప్యాకేజీలో ఉన్న ఆరు విధానాలను వివరించారు. అమర హాస్పిటల్ ఛైర్మన్ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని నేతృత్వంలో స్పెషలిస్ట్ ఆర్థోపెడిక్ డాక్టర్లు ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకోవాల్సిన వారు మరిన్ని వివరాల కోసం హాస్పిటల్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా రేపాకుల సుబ్బమ్మ తోట ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయంలో సోమవారం రేపాకుల సుబ్బమ్మ తోట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు ఆలయం నుంచి సీతాలక్ష్మణ సమేత కోదండరామ స్వామి ఉత్సవమూర్తులను పాత ప్రసూతి ఆస్పత్రి రోడ్డులోని ఆర్ఎస్ గార్డెన్స్‌కు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, ఆస్థానం, నివేదన చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా రాత్రి 7 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ శిక్షణ విజయవంతం



మ్యాజిక్ శిక్షణ పొందిన చిన్నారులు

తిరుపతి (టీటీడీ), ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): వేమన విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సాగిన మ్యాజిక్ శిక్షణ సోమవారం ముగిసింది. మెజీషియన్ ఎంఎస్ యుగంధర్ బాబు శాస్త్రీ య అవగాహనతో కూడిన మ్యాజిక్‌ను పిల్లలకు నేర్పించారు. 50 రకాల మ్యాజిక్‌లను ఉత్సాహవంతులకు నేర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దామోదరం, కార్యదర్శి నాగార్జున, నారాయణ, రెడ్డెప్ప, బిర్లా నాయుడు, వెంకటరమణ, మునిలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఎస్వీజేసీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఎస్వీ జూని యర్ కళాశాల విద్యార్థు లు గతకంటే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 84.50 శాతం ఉత్తీర్ణత సాధిం చారని కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 355 మంది విద్యార్థులకుగాను 300 మంది ఉత్తీర్ణత పొందారని వెల్లడించారు. బైపీసీలో వెంకటచరణ్ 977, పవన్ కుమార్ 972, సీఈసీలో శ్యామ్ 964, ఎంపీసీలో నందకిషోర్ 951, శ్రీను 945 మార్కులు సాధించారని వివరించారు. ప్రథమ సంవత్సరంలో 531 మందికిగాను 309 మంది ఉత్తీర్ణత సాధించారని, ఎంపీసీలో లక్ష్మీచరణ్ 461, యోగేశ్వర 460, ఎంఈసీలో వరుణ్ సందేశ్ 478, గౌతమ్ 473, బైపీసీలో కార్తిక్, దుర్గాప్రసాద్ 429, ఎంపీసీలో మహేష్ 456 మార్కులు పొందారని తెలిపారు.

ఇంటర్‌లో గీతం విద్యార్థుల విజయకేతనం



ఉత్తమ మార్కులు సాధించిన గీతం విద్యార్థులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భవానీనగర్ లోని గీతం జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో పలువురు విద్యార్థులు 466 నుంచి 460 మార్కులు సాధించారని వెల్లడించారు. 50 మంది విద్యార్థులు 450 మార్కులు పొందారని తెలిపారు. జూనియర్ బైపీసీలో పలువురు విద్యార్థులు 429 నుంచి 422 మార్కులు పొందారని వెల్లడించారు. సీనియర్ ఎంపీసీలో 986, 980 మార్కులు, బైపీసీ గ్రూప్‌లో 983, 975 మార్కులు, సీఈసీ గ్రూప్‌లో 969, 964, 959 మార్కులు సాధించారని వెల్లడించారు. వీరిని కళాశాల అధినేత వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బీవీ గోపీనాథ్ అభినందించారు.

స్విమ్స్‌లో..

తిరుపతి(వైద్యం) : స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు, సాధించిన విజయాలను వివరించారు. ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. వైద్య విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

తిరుపతి(విద్య) : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. విద్యార్థులు చదువుకుంటూనే అంబేడ్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు వినోద్, శివ, నగర ఉపాధ్యక్షులు రవీంద్ర, శశి, అజయ్, పురుషోత్తం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

తిరుపతి(వైద్యం) : ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నేతలు వెంకటనరసింహులు, మురళీకృష్ణ, గోపి, శివశంకర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..



తిరుపతి(ఉపాధ్యాయనగర్) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలతోనే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, పొన్నగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో..



నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం) : పోలీసు పరేడ్ గ్రౌండులో ఎస్పీ హర్షవర్ధన రాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

సదరన్ డిస్కం కార్యాలయంలో..



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఎండీ, అధికారులు, ఉద్యోగులు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి సీఎండీ కె.సంతోషరావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యాలయంలో చిత్రపటం పెట్టి, పుష్పాంజలి ఘటించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చేసిన సేవలను సీఎండీ గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు టి.జయరామయ్య మాట్లాడారు. అనంతరం కార్మికులకు దుస్తులు వితరణ చేశారు. డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పఠాన్ అయూబ్‌ఖాన్, సీజీఎంలు జే రమణాదేవి, డీఎస్ వరకుమార్, కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జానకిరామ్, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, పీ మురళి, సురేంద్రరావు, మురళీకుమార్, శ్రీకాంత్, అసోసియేషన్ నాయకులు శంకరయ్య, బాబు పాల్గొన్నారు. ● పాత తిరుచానూరు రోడ్డులోని డీఈ కార్యాలయ ప్రాంగణంలో ఈఈలు చంద్రశేఖర రావు, చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆంజనేయులు, ఉమాపతి, టి.మోహన్, అభినయ్ కార్తీక్, ఏ.మోహన్, ఐ.సుబ్రమణ్యం, శేఖర్ బాబు, తులసీరామ్, చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. ● ఎస్ఈ కార్యాలయంలో ఉద్యోగులు అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో..

తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఉద్యోగులు అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్ఎంఆర్ డాక్టర్ చిన్నప్పరెడ్డి, సుదర్శన్‌బాబు, రత్నానాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. తిమ్మి నాయుడుపాళెం హరిజనవాడ వద్ద అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాయం వెంకటరత్నం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఊకా విజయకుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి, పరసారత్నం, బీజీ కృష్ణయాదవ్, దండు విజయ్ పాల్గొన్నారు. ● **జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద** జయంతి వేడుకలను నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమారమ్మ, కార్పొరేటర్ అన్నా అనిత, టీడీపీ నేతలు శ్రీనివాసయాదవ్, గోళ్ల మధుసూదన్‌నాయుడు, నాగరాజునాయుడు, సుధాకర్, తిరుమలనాయుడు, శేఖర్‌యాదవ్, సుబ్రహ్మణ్యం, రవీంద్ర, శ్యామల, లక్ష్మి, లత, తులసి, శశిరేఖ పాల్గొన్నారు. ● **తిరుపతి అర్బన్** : ఇండియన్ హ్యూమన్‌రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్‌బాబు, బి.రమేష్, బి.భువనేశ్వరి పాల్గొన్నారు. ● **ప్రజారవాణాధికారి కార్యాలయంలో** డీపీటీవో జి.నరసింహులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, డిప్యూటీ ఈఈ చెన్నకేశవులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **వెటర్నరీ వర్సిటీలో** : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతి రామయ్య నేతృత్వంలో పలువురు అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ మాజీ కన్వీనర్లు ప్రొఫెసర్ బి.రాంబాబునాయక్, ప్రొఫెసర్ జి.గంగరాజు, ఓఎస్ఏ ప్రొఫెసర్ ఆర్.వేణు పాల్గొన్నారు.



ఎస్వీయూలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు - పద్మావతి వర్సిటీలో వీసీ ఉమ - సంస్కృత వర్సిటీలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, వీసీ కృష్ణమూర్తి

యూనివర్సిటీల్లో అంబేడ్కర్‌కు నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఎస్వీయూలో నిర్వహించిన సభలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంద్రాయుడు, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి పాల్గొని మాట్లాడారు. ● పద్మావతి వర్సిటీలో నిర్వహించిన సభలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ.. పద్మావతి యూనివర్సిటీ ఏర్పాటు ఏప్రిల్ 14వ తేదీ జరగడం సంతోషమన్నారు. జిల్లా మూడవ అదనపు సెషన్ జడ్జి గురునాథ్, జిల్లా నాల్గవ అదనపు సెషన్ జడ్జి అర్చన మాట్లాడారు. ● ఎస్వీ వ్యవసాయ కాలేజీలో నిర్వహించిన సభలో అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్ పాల్గొని మాట్లాడారు. ● సంస్కృత వర్సిటీలో నిర్వహించిన సభలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, వీసీ కృష్ణమూర్తి, ఐఎంఏ ఉపాధ్యక్షుడు శ్రీహరిరావు, షార్ శాస్త్రవేత్త శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

కుల వ్యవస్థను నిర్మూలించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దానికోసం పోరాడిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని హైదరాబాద్‌కు చెందిన న్యాయ నిపుణుడు శ్రీకాంత్ అన్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో సోమవారం అంబేడ్కర్ జయంతిని టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ దళితులు, వెనుకబడిన వర్గాలు, స్త్రీలకు ఉన్నత అవకాశాలు కల్పించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. అనంతరం టీటీడీ విభాగాల్లో ప్రతిభచాటిన 45 మంది ఉద్యోగులను సన్మానించారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి



చెన్నాయిగుంట గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి మురళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సమస్యలను త్వరగా పరిష్కరించాలని ప్రజలు సచివాలయ అధికారులను కోరారు. సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం 2, తిరుమలనగర్, శెట్టిపల్లి సచివాలయాల పరిధిలో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. చెన్నాయిగుంట శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని, శుభ్రపరచాలని, ప్రహరీగోడ నిర్మించాలని కోరారు. సైడు కాలువలు మరమ్మతులు చేయాలని, న్యూమంగళంలో బోర్లు వేయించాలని కోరారు. మంగళం 2అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని, పద్మావతి నగర్‌లో డ్రైనేజీలు నిర్మించాలని, ఆర్డీవో కార్యాలయం వద్ద మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించాలని, దోమలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. రణధీరపురంలో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ చేయించాలని కోరారు. తిరుమలనగర్‌లో సైడు కాలువలు, అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అంతకుముందు అన్ని కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. కార్యదర్శులు మురళి, నాగరాజులు, స్వాతి, లావణ్య, జయశంకర్ పాల్గొన్నారు.

మృతుడు సత్తెనపల్లి వాసి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుచానూరు పరిధిలోని భీమవరం భోజనాల వెనుక గతనెల 20వ తేదీన గుర్తించిన మృతదేహం పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసిదిగా పోలీసులు నిర్ధారించారు. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి తగుల పెట్టారని ప్రకటించిన పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో మృతుడి భార్య తిరుపతమ్మ తిరుచానూరు పోలీసులను సంప్రదించారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ చెప్పిన వివరాల మేరకు.. సత్తెనపల్లికి చెందిన పిన్ని తిరుపతి(36) కొన్నేళ్ల క్రితం తన తల్లి రాయుడు విజయతో కలసి బతుకుదెరువు కోసం తిరుపతికి వచ్చారు. చెన్నారెడ్డి కాలనీలో టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవితం సాగిస్తున్నారు. తిరుపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో తిరుచానూరు వద్దకు వచ్చి పడిపోయాడు. ఎండకు ఎండి శరీరం బాగా కమిలిపోయింది. కాగా, ఎవరో చంపి ఇక్కడికి తీసుకొచ్చి యాసిడ్ పోసి కాల్చేశారనేది అవాస్తవమని, అతనిది సాధారణ మరణమేనని డీఎస్పీ చెప్పారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం

మంగళం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారులు ఆదివారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు రేణిగుంట-కడప రహదారిలోని అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి 7గంటల నుంచి వాహనాల తనిఖీలు చేపట్టారు. టీఎన్28 ఏజెడ్ 1714 నెంబరుగల గూడ్స్ వ్యాన్ వేగంగా రావడాన్ని గమనించారు. అధికారులను గమనించిన డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపి పారిపోయాడు. వాహనంలో తనిఖీ చేయగా పుదీనా కట్టల మధ్య దాచి ఉంచిన ఆరు ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటి బరువు 260 కేజీలు ఉంటుందని తెలిపారు. వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో రమేష్‌బాబు, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతర వారాలు ప్రారంభం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మే 6 నుంచి 13వ తేదీ వరకు జరగనుంది. జాతర ముందు మూడు వారాలు, తర్వాత ఐదు వారాలు మారుపొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీ (మంగళవారం) తొలివారం ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేయనున్నారు.

కోటా నీట్ గ్రాండ్ టెస్ట్ పేపర్స్ సిద్ధం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ - 2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం కోటా 2025 డిజిటల్ గ్రాండ్ టెస్ట్ పేపర్స్, సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్స్ బుక్‌లెట్లను సిద్ధం చేసినట్టు ఐఐటీ - జేఈఈ- నీట్ ఫోరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్లను వాట్సాప్ ద్వారా పొందవచ్చని సూచించింది. మరింత సమాచారం కోసం NEET GT 2025 అని టైప్‌చేసి 9849016661కు వాట్సాప్ మెసేజ్ పంపించాలని పేర్కొంది.

ఆర్టీసీలో అన్నదానం

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం సెంట్రల్ బస్టాండులో బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.పరశురామ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది, ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు పి.నాగులయ్య హాజరవగా డిపో నాయకులు ఎం.బి.సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, భద్రయ్య, రెడ్డెప్ప, వాసులు, వెంకటేశులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి రోజున మద్యం నిషేధించాలి

మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవానంద్

తిరుపతి(గాంధీరోడ్డు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి తరహాలో అంబేడ్కర్ జయంతి రోజున మద్యం నిషేధించాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్ కోరారు. ఎస్వీయూ వద్ద సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి మాట్లాడారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. మహిళా ప్రతినిధి అమరావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కోశాధికారి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్, సభ్యులు చెంగయ్య, శ్రీరాములు, రాంబాబు, రమణయ్య, గుణశేఖర్, జగదీష్, హరిత తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



గుండుతో స్వామిని దర్శించుకుని



ధ్వజస్తంభానికి మొక్కి



అఖిలాండం వద్ద టెంకాయకొట్టి



హారతిచ్చి





అన్నదానానికి బిడ్డపేర విరాళమిచ్చి, భక్తులకు వడ్డించి

బిడ్డ కోసం..

ఆమె ఈ నేలమీద పుట్టలేదు. ఆమె హిందువు కాదు. ఆమె ఆచార వ్యవహారాలు భిన్నమైనవి. అయినా హిందూ విశ్వాసాలకు కట్టుబడ్డారు. పూజాపునస్కారాలు చేసి, మన ఆచారాలు పాటించారు. బిడ్డ కోసం ఒక తల్లి పడ్డ తపన ఇది. పవన్‌కల్యాణ్ సహచరి అన్నా లెజినోవా రెండు రోజులుగా తిరుమలలో వ్యవహరించిన తీరు అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తమ కుమారుడు మార్క్ శంకర్ గాయపడడంతో తల్లడిల్లిన ఆ తల్లి.. స్వల్పగాయాలతో క్షేమంగా బిడ్డ బయటపడడంతో తేలికపడి, తిరుమల కొండకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రష్యాలో పుట్టి పెరిగిన అన్నా లెజినోవా క్రిస్టియన్ అయినప్పటికీ శ్రీవేంకటేశ్వరుడిమీద సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ సంతకం చేశారు. హిందూ ఆచారాలకు అనుగుణంగా గుండు చేసుకుని, స్వామిని దర్శించుకున్నారు.



తనూ అందరితో కలిసి భోంచేసి..

అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఏం చేయాలంటే..!

● అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహనా కార్యక్రమాలు



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదం సంభవిస్తే.. ఏం చేయాలి? ఎలా బయటపడాలి? అనే విషయాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో వివిధ అంశాలపై ప్రాక్టికల్‌గా డ్రిల్ చేసి వివరించనున్నారు. ఎండాకాలం ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే విలువైన ఆస్తులు కాలి బూడిదయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు సూచించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక దళ సిబ్బందికి నివాళులర్పించారు. 15న ప్రధాన కూడళ్లలో ప్రదర్శన, 16న అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో, 17న పాఠశాలలు, కళాశాలల వద్ద, 18, 19, 20 తేదీల్లో పరిశ్రమలు, పెట్రోలు బంకులు, వర్తక, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, ఫంక్షన్ హాళ్ల వద్ద అవగాహన కల్పిస్తారు.

ఇంగ్లాండ్ సిరీస్ ఛాలెంజింగ్

● టీం ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్



తిరుమల, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్ సిరీస్ ఛాలెంజింగ్‌గా ఉండబోతుందని టీం ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ అన్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లన్నీ ఎప్పుడూ సవాలుగానే ఉంటాయన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. టీ20 వరల్డ్ కప్ గెలిచాక శ్రీవారిని దర్శించుకున్న తాను ఇండియా ఛాంపియన్ ట్రోఫీ కూడా గెలవాలని మొక్కుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత యువ క్రికెటర్లు ఐపీఎల్‌లో తీవ్ర ఒత్తిడిలో బాగా ఆడుతున్నారన్నారు. ఇండియన్ టీంకు వారు వచ్చినప్పుడు కలిసొస్తుందని అభిప్రాయపడ్డారు.

అమెరికాలో వెంకటగిరి యువకుడి మృతి

వెంకటగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కిన్నంబేటి వరప్రసాద్(బాబ్‌జీ) కుమారుడు విశ్వతేజ(34) అమెరికాలో మృతి చెందినట్లు సమాచారం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న విశ్వతేజ అక్కడి అమ్మాయినే వివాహం చేసుకున్నాడు. అతడి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం బాధ్యతల స్వీకరణ

● శాంతి భద్రతలు, నేరాలు నియంత్రణకు పెద్దపీట



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర డీఎస్పీగా భక్తవత్సలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సత్యవేడు, వయలకలచెరువు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం జరిగిన డీఎస్పీల బదిలీల్లో తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలంను ప్రభుత్వం నియమించింది. దీంతో ఈయన తిరుపతి డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, నేరాల నియంత్రణకు అన్ని సర్కిళ్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. విధులు పట్ల నిర్లక్ష్య భావాన్ని సహించేది లేదన్నారు.

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు

● మాజీ ఎమ్మెల్యే అనుచరుడి బరితెగింపు

తిరుచానూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఓ ఉద్యోగినిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా... తిరుపతి మాజీ ఎమ్మెల్యే సిఫారసుతో వెంకటరమణ అనే వ్యక్తి గతంలో ఒప్పంద కార్మికుడిగా శిల్పారామంలో అటెండర్‌గా చేరాడు. శిల్పారామానికి చెందిన రాష్ట్ర స్థాయి అధికారితో పాటు నామినేటెడ్ పదవిలో ఉన్న ఓ నాయకుడి కుటుంబంతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో వెంకటరమణ పెత్తనం చెలాయిస్తున్నాడు. పదిరోజుల క్రితం ఇతడు ఓ ఉద్యోగిని వేధించాడు. ఆమె ఎదురుతిరగడంతో సస్పెండ్ చేయిస్తా... తానేది అనుకుంటే అది జరుగుతుందని బెదిరించాడు. చివరకు బాధితురాలు తోటి ఉద్యోగుల వద్ద వాపోయింది. దీంతో వారంతా ఏకమై సోమవారం సంస్థ ఏవో సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏవోను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న ఓ ఉన్నతాధికారి బెదిరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు, వరుస సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 29వేలమంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 586, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,554మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,648మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,087మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,561, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 551మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 281మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 100మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 30,353 అమ్ముడైనట్లు అధికారులు చెప్పారు.

నేడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని లింక్ బైపాస్‌రోడ్డులో గల ఎస్ఎస్ కల్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం జరుగుతుంది.

రైలు నుంచి జారిపడిన ప్రయాణికుడి మృతి


మృతుడు మురళి (ఫైల్‌ఫొటో)

పిచ్చాటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రైలు దిగుతూ జారిపడిన ఓ ప్రయాణికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని రజానగరం గ్రామానికి చెందిన పరుచూరి మురళి(51) తన సొంత పనుల నిమిత్తం శనివారం చెన్నైకి వెళ్లాడు. అక్కడ విల్లివాక్కం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చెన్నైలోని ఓ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం 11 గంటలకు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్‌బీఐ ఆర్‌వో ప్లాంట్ విరాళం



పిచ్చాటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పిచ్చాటూరులోని నెప్రహా యువజన సేవా సంఘానికి రూ.2 లక్షలు విలువైన రివర్స్ అస్మాసిస్(ఆర్‌వో)నీటి శుద్ధి ప్లాంట్‌ని స్థానిక ఎస్‌బీఐ శాఖ అధికారులు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సీఎంహెచ్ఆర్ మహేంద్ర, సేవా డీజీఎస్ శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం శ్రీకాళహస్తి మండలంలోని ఇసుకగుంట వద్ద జరిగింది. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన ధర్మయ్య సొంతపనుల నిమిత్తం పట్టణానికి వచ్చాడు. ఒడిశాకు చెందిన హరీందర్‌కుమార్ రాచగున్నేరి వద్ద ఉన్న పరిశ్రమలో పనిచేస్తుంటాడు. వీరిద్దరు సోమవారం ఆటోలో రాచగున్నేరికి వెళుతుండగా ఓ కారు ఇసుకగుంట వద్ద ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న ధర్మయ్య, హరీందర్‌కుమార్ గాయపడ్డారు. స్థానికులు వారిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శుకబ్రహ్మాశ్రమ సేవలు ప్రశంసనీయం


విద్యాస్వరూపానందగిరిస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శుక బ్రహ్మాశ్రమ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఆశ్రమంలో నిర్వహించే భక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అద్దాలను పంపిణీ చేశారు.

సత్యవేడు-బెంగళూరు బస్సు సర్వీసు ప్రారంభం



సత్యవేడు, ఏప్రిల్ 14: సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన నూతన బస్సును ఎమ్మెల్యే ఆదిమూలం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సత్యవేడు - బెంగళూరు సర్వీసుకు సంబంధించిన ఎక్స్‌ప్రెస్ బస్సును ఆర్టీసీ డీఎం వెంకటరమణతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం టికెట్ కొనుగోలు చేసి కొంతదూరం బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పుత్తేరిలో ఉచిత వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి గ్రామంలో సర్పంచ్ గుడ్ల రామ్మూర్తి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తికి చెందిన బాలజీ క్లినిక్‌కు చెందిన డాక్టర్ భానుమతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వీరరాఘవులు, టీడీపీ నాయకులు మునిచంద్రనాయుడు, రవినాయుడు, కార్తీక్‌నాయుడు గ్రామస్తులు శంకర్, రంగయ్య. జయకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరి వాడు

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఊరూరా నివాళి



పుచ్చకాయలను అందజేస్తున్న వినుత, అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఈవో బాపిరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, కాంగ్రెస్ ఆధ్వర్యంలో డాక్టర్ బత్తెయ్యనాయుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ, పుచ్చకాయలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్, చెంచయ్యనాయుడు, గోపి, షాకీరాలీ, గురుదశరధన్, దళిత, గిరిజన నాయకులు, బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్‌నాథ్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్వీయే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగ రాజు నాయుడు, శ్రీకాళహస్తీశ్వ రాలయ పరిపాలన భవనంలో ఈవో బాపిరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటించారు. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. స్కౌట్ విద్యార్థులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, స్కౌట్స్ యూత్ చైర్మన్ అజారుద్దీన్ పాల్గొన్నారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో, సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంజలి ఘటించారు. జనమాల గురవయ్య పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు ఉమేష్‌రావు, పేట బాలాజీరెడ్డి, వజ్రం కిషోర్, సుబ్రహ్మణ్యం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. స్కిమ్స్ కళాశాలలో కరస్పాండెంట్ మిద్దెల హరి, డైరెక్టర్ కుమార్, అధ్యాపకులు సునీల్‌కుమార్, ఏవో సౌందర్యరాజ, ఈశ్వరయ్య పాల్గొన్నారు. ఆర్టీసీ డిపోలో జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులను సన్మానించారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జరిగిన వేడుకల్లో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీనాయుడు, రైతు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, నాయకులు కస్తూరయ్య, ఉదయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, కోట చంద్రశేఖర్, దళిత నాయకులు హరిబాబు, రమేష్, రమాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కోలా ఆనంద్ తదితరులు


ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న జైభీమ్ అసోసియేషన్ నాయకులు


తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

కేవీబీపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా వాడవాడలా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, గ్రామస్తులు నివాళులు అర్పించారు. కేవీబీపురం, పెరిందేశం, కళత్తూరు, రాయపేడు, పాతపాళెం, దిగువపుత్తూరు తదితర గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో భారత్‌గ్యాస్ ధనంజయరెడ్డి, టీడీపీ మణి, అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు పొల్గుణ, బాలాజీ, థామస్, బీజేపీ మండలాధ్యక్షుడు బాబుయాదవ్, మునిశేఖర్, అశోక్‌రెడ్డి, ఆనందరెడ్డి, మోహన్‌నాయుడు, ఆర్ వేలు, బాషా, చెంచయ్యశెట్టి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో వాడవాడలా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో తహసీల్దారు రాజశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇక మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు మాజీ సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కాంపాళెం, పుత్తేరి, కనమనంబేడు, నీర్పాకోట, పల్లమాల తదితర గ్రామాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అంబేడ్కర్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, వైసీపీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త రాజేష్, తెలుగుదేశం నాయకులు మునిచంద్ర నాయుడు, అంబేడ్కర్ సొసైటీ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు సాయిబాబా గుడి సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి పాలాభిషేకం చేశారు.

రేణిగుంట : అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జనసేన, బీజేపీ, వైసీపీ, వామపక్షాలు, దళిత సంఘం నాయకులు అంబేడ్కర్‌కు అంజలి ఘటించారు. వైసీపీ నాయకులు అన్నదానం చేశారు.


వరదయ్య పాలెంలో నివాళులు అర్పిస్తున్న అంబేడ్కర్ సేవా సంఘం నాయకులు


బీఎన్‌కండ్రిగలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ఆదర్శనీయుడు అంబేడ్కర్


నారాయణవనంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ కొన్ని వర్గాల వారికే పరిమితం కాదని అందరి వాడని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. సత్యవేడులో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలను అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ రమణ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో, ఎన్టీఆర్ పార్కు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామస్వామి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీటీసీ టీబీఎస్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు ఎంపీ రవి, మాణిక్యం, జోసెఫ్, టీడీపీ నాయకులు చిన్న, శశి, శివానందం, జనసేన నాయకులు బాల మురళి, రూపేష్‌కుమార్, బీజేపీ నాయకులు బాలాజీ, మునిక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ● వైసీపీ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వ ర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నాగలాపురం: నాగలాపురం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడ రక్తదాన శిబిరం సందర్శించి రక్తదాతలకు పండ్లు, జ్యూస్ అందించారు.. ● స్థానిక సుందరయ్య కాలనీలో వ్యవసాయకార్మిక సంఘం నాయకులు అముద ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు అంజలి ఘటించారు. ● మండలంలోని టీపీకోటలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

నారాయణవనం: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. ఉదయం మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం బైక్ ర్యాలీ చేపట్టారు. జాతీయ రహదారిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేకు కట్ చేశారు. పంచాయితీ కార్యాలయంలో పారిశుద్య కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం జడ్పీటీసీ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ● సత్యవేడు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు లావణ్యకుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్ కుమార్, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, సర్పంచ్ కేజీ శారదమ్మ, టీడీపీ నాయకులు గణేషన్, లక్ష్మణరామన్, ఆర్ముగం, సుధాబాబు తదితర నాయకులు, జనసేన నాయకులు సుమన్, ఆర్ముగం, రామూర్తి, డేనియల్, మునికృష్ణ, సతీష్, దళిత సంఘ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


టీపీకోటలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

అమరలో రోబోటిక్ డే ఆఫర్లకు విశేష స్పందన


మోకాలి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కరకంబాడి వద్ద ఉన్న అమర హాస్పిటల్‌లో నిర్వహించిన రోబోటిక్ డే ఆఫర్లకు విశేష స్పందన లభించింది. సోమవారం అమర హాస్పిటల్ నిర్వహించిన మోకాలి మార్పిడి స్క్రీనింగ్ క్యాంపునకు విచ్చేసిన 80 మందికి ఉచితంగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ రాయలసీమలోని ప్రజలు చెన్నై, బెంగళూరుకు వెళ్లి మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించుకుంటున్నారని అక్కడ కన్నా మెరుగైన వైద్యం అతి తక్కువ ధరకే అమర హాస్పిటల్‌లో అందిస్తున్నామని తెలియజేశారు. కేవలం రూ.2.50లక్షలతో మోకాలి మార్పిడి ప్యాకేజీని ప్రవేశ పెట్టామన్నారు. ఈ ప్యాకేజీలో ఉన్న ఆరు విధానాలను వివరించారు. అమర హాస్పిటల్ చైర్మన్ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని నేతృత్వంలో స్పెషలిస్ట్ ఆర్థోపెడిక్ డాక్టర్లు ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకోవాల్సిన వారు మరిన్ని వివరాల కోసం హాస్పిటల్‌ను సంప్రదించాలని కోరారు.

15 పంచాయతీల్లో గ్రామ సభలు

రేణిగుంట, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 15 పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యదర్శులు ఆధ్వర్యంలో సమస్యలపై, అభివృద్ధి పనులపై చర్చించారు. అంతకుముందు పంచాయతీ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

రేణిగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఓ మహిల మృతిచెందింది. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట పాంచాలి నగర్‌కు చెందిన గోపి, సుజన (49) దంపతులు. వీరు కరకంబాడి పంచాయతీ పరిధిలోని దొడ్డమెట్లకు సొంతపనిపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి రేణిగుంటకు బయలుదేరారు. కొత్త చెక్‌పోస్టు కూడలిలో రోడ్డు పనులు జరుగుతుండడంతో ఒక వైపు రోడ్డు మూసివేశారు. దీంతో అక్కడ రోడ్డు కాస్త ఇరుకుగా ఉంది. ఈ క్రమంలో అక్కడ మలుపులో ఎదురుగా వస్తున్న లారీ వెనుకభాగం వీరి వాహనానికి తగలడంతో దంపతులు కిందపడ్డారు. సుజనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బీరు బాటిల్‌తో దాడి

రేణిగుంట, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురంలో కాపురం ఉంటున్న మురళి ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రైల్వే గేటు వద్ద అదే గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి మురళితో వాదనకు దిగాడు. బీరు బాటిల్‌తో దాడిచేయడంతో మురళికి గాయాలయ్యాయి. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు పుత్తూరు విద్యార్థి


విద్యార్థి ప్రేమ్‌కుమార్‌కు అభినందన

పుత్తూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పుత్తూరులోని ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన ప్రేమ్‌కుమార్ ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలలో 977 అత్యధిక మార్కులను సాధించడంతో ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్ అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ అవార్డును 15వ తేదీన విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. విద్యార్థికి రూ.5 వేల బహుమతిని అందించారు. అధ్యాపకులు ఏకాంబరాచారి, ప్రసాద్, జయప్రసాద్ పాల్గొన్నారు.

20వరకు అగ్నిమాపక వారోత్సవాలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్, ఆఫీసర్ నేతాజీ, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, కమిషనర్ ఫైర్ ఆఫీసర్ నేతాజీ పేర్కొన్నారు. సోమ వారం మున్సిపల్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అగ్నిమాపక వారోత్స వాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మెన్ విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, గిరిధర్, శివయ్య, ఫైర్‌మెన్ శరత్, ముని, ప్రతాప్, డీవోపీ మనోజయ్య, విశ్వనాథం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..అన్నదాతకు నష్టం

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అన్నదాతలు అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం పుత్తూరు మండల పరిధిలో వడగండ్ల వర్షం పడింది. మామిడి పిందెలు చాలా వరకు రాలిపోయాయి. పైగా ఉన్న కాయలకు మచ్చలు ఏర్పడి ధరలు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు.

పుత్తూరు వార్తలు

అంబేడ్కర్ సేవలు అజరామరం



వడమాలపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్
పుత్తూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన మాజీ మంత్రి రోజా

పుత్తూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్వేటి నగరం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు గజమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, మైనారిటీ నాయకుడు మాహీన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ● బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య ఆధ్వర్యంలో కళాశాలలోని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించు కున్నారు. అధ్యాపకులు శ్రీనివాసులు, బాబురావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వడమాలపేట: నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ మంత్రి రోజా, గాలి జగదీష్ స్థానిక అంబేడ్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు జయంత్, మునిబాబు, దిలీప్, వెంక టేష్, మునిశేఖర్, హేమావతి, వినోద్, గురవయ్య, హరిబాబు, దాము, ధనంజయులునాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగం పాలనకు దిక్సూచి


రక్తదానం చేస్తున్న జీవరత్నం నాయుడు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ప్రజా పాలనకు దిక్సూచి అని నగరి శాసన సభ్యులు గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలను పుత్తూరులో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మెరుపుల మహేష్, దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● అలాగే స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పూలమాల వేసి అంజలి ఘటించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, ఇతర నాయకులు దాసరి విజయ్‌చౌదరి, మధుసూదన్‌రాజు, చంద్రయాదవ్, గాలి పాండురంగయ్య, మణికంఠ, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

కార్వేటినగరం రోడ్డులోని కెనెరా బ్యాంక్ ఎదురుగా బలరామ్, పద్మావతి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి దొరస్వామి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ మనోహర్, బ్యాంక్ సీనియర్ ఉద్యోగి పురుషోత్తం, డాక్టర్లు నరసింహులు, రాజేంద్ర, సుకన్య, ప్రేమ్‌చందర్, ఇతరులు గుర్రప్ప, రాజ్‌కుమార్, పరందామనే తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని అంబేడ్కర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అపరంజి, ట్రెజరర్ కుప్పయ్య తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరిం చుకుని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే కేవీపీస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, దళిత నాయకులు మావిలయ్య, విజయ్‌కుమార్, నాగేంద్రరావు, డాక్టర్ రాజేంద్ర, జి.షణ్ముగం, సంపత్, అంకయ్య, కృష్ణమూర్తి, తంగవేలు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తమిళ ఉగాది వేడుకలు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తమిళులకు అత్యంత ముఖ్యమైన ఉగాది పర్వదినాన్ని పుత్తూరులో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు పాల కలశాలతో ఊరేగింపు చేపట్టారు. సుబ్రమణ్యం స్వామి ఆలయంలో పాలాభిషేకం నిర్వహించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్ల సేవలు


అన్నదానం చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వర మంగళంలో ఉన్న దక్షిణ కాళిఅమ్మన్ వారాహి శక్తి పీఠంలో తమిళ ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు సేవలందించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ భూలోకేశ్వరి, యువశ్రీ, శైలజ, రోవర్ లీడర్ జయకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి 17వ తేదీ వరకు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 15న ఉదయం 8గంటలకు అంబలి నైవేద్యం, 9గంటలకు గెరిగ ఊరేగింపు, మధ్యాహ్నం మైల ముగ్గు, సాయంత్రం శేష పాన్పు ముగ్గు ఉంటుందని తెలియజేశారు. 16వ తేదీ ఉదయం 8గంటలకు పోతురాజు ముగ్గు, మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం , సాయంత్రం 3గంటలకు రేణుకాదేవి ముగ్గు, కుంభం, 17న ఉదయం 8గంటలకు ముత్యాలమ్మ ముగ్గు, రాత్రి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.



శ్రీకాళహస్తి

సత్యవేడు

పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ కార్యవర్గం ఎన్నిక



సత్యవేడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ సత్యవేడు తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హేమభూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా వాసుదేవరావు (ఆర్‌డబ్ల్యుఎస్), జనరల్ సెక్రటరీగా రెడ్డిప్రసాద్ (పీఆర్), ట్రెజరర్‌గా నందగోపాల్ (ఎంపీడీవో కార్యాలయం), జాయింట్ సెక్రటరీగా సురేష్‌కుమార్ (ఇరుగుళం జడ్పీహైస్కూల్), జిల్లా కౌన్సిల్-1 గా నారాయణయాదవ్ (ఎంపీడీవో కార్యాలయం), జిల్లా కౌన్సిల్-2గా నాగరాజు (ఎంపీడీవో కార్యాలయం - నాగలాపురం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అదికారులుగా అసోసియేషన్ జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చెంచురత్నం వ్యవహరించారు.

వేదోక్తంగా మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. అనంతరం మృత్యుంజయ స్వామి వారికి వివిధ అభిషేకాలు చేశారు. వివిధ పుష్పాలతో, వెండి నాగా భరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే బొజ్జల నివాళి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖుడు పాపగారి శివాజీరావు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం పలువురిని పరామర్శించారు. ఇటీవల సీనియర్ పాత్రికేయులు రహంతుల్లా సతీమణి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం వా స్వగృహానికి చేరుకుని రహంతుల్లా పరామర్శించారు. అదే విధంగా పట్టణానికి చెందిన నగల దుకాణం వ్యాపారి జూలుగంటి గోపి తల్లి ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్‌నాయుడు, షాకీరాలీ, గుర్రప్పశెట్టి పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో తీరిన తాగునీటి సమస్య



బాగుచేసిన బోరు నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళ

కేవీబీపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బోర్లు మరమ్మతులకు గురై తాగునీటి సమస్య ఏర్పడింది. దీనిపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'బ్రాహ్మణపల్లిలో దాహం.. దాహం' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ రవి తన సొంత నిధులను వెచ్చించి బోర్లను బాగు చేయించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహసిత, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద సోమవారం ఘనంగా వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా విధి నిర్వహణలో మరణించిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులు అర్పించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి, అగ్నిమాపక ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన్ ఔషధీ కేంద్రం సందర్శన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న ప్రధానమంత్రి జన్ ఔషధీ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సందర్శించారు. అక్కడ ఉన్న మందుల రకాలను పరిశీలించారు. తక్కువ ధరకు ఇక్కడ మందులు దొరుకుతాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నిర్వాహకులు సూర్యకుమార్, అరుణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 46 మందికి రూ.52,72,669 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.





